# వైభవం.. గోదా రంగనాథుల కల్యాణం

నస్రుల్లాబాద్/మాచారెడ్డి/బాన్సువాడ టౌన్/దోమకొండ, జనవరి 14: ధనుర్మాస ముగింపు సందర్భంగా వైష్ణవాలయాల్లో గోదా రంగనాథుల కల్యాణ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించిన వేడుకల్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి దంపతులు పాల్గొన్నారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణమహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీధర్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు. బాన్సువాడ పట్టణంలోని కొటగల్లీలో ఉన్న వేంకటేశ్వర ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఉత్సవ విగ్రహాలతో పల్లకీ సేవ నిర్వహించారు. దోమకొండ మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్ గౌడ్, సీడీసీ చైర్మన్ నర్సయ్య, ఎంపీటీసీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


బాన్సువాడలోని వేంకటేశ్వర ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం, వేడుకలను తిలకిస్తున్న భక్తులు


మాచారెడ్డి మండలం చుక్కాపూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో..


దోమకొండలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో..


ఆత్మాకూర్ గ్రామంలో రేషన్ షాపును పరిశీలిస్తున్న మనోహర్ రెడ్డి

## రేషన్ తూకంలో తేడా వస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డి, జనవరి 14: రేషన్ దుకాణాల ద్వారా పేద ప్రజలకు పంపిణీ చేసే బియ్యం తూకం వేయడంలో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని నాగిరెడ్డిపేట జడ్పీటీసీ, విజిలెన్స్ కమిటీ జిల్లా డైరెక్టర్ మనోహర్ రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మాకూర్ గ్రామంలో ఉన్న రేషన్ దుకాణాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యం తూకాన్ని తనిఖీ చేశారు. బియ్యం తూకం చేసే సమయంలో కొందరు గోనె సంచి వేస్తున్నారని, దీంతో 600 గ్రాముల బియ్యం తక్కువగా వస్తాయన్నారు. పేదలకు అన్యాయం జరిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని డీలర్లను హెచ్చరించారు.

## అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ


ఎల్లారెడ్డి ఎస్సై గణేశ్‌కు అక్షింతలను అందజేస్తున్న తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు

బీబీపేట్/ఎల్లారెడ్డి రూరల్, జనవరి 14: బీబీపేట్ మండలంలోని అన్ని గ్రామాల్లో అయోధ్య రాముడి పూజిత అక్షింతలను ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్షింతల కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్య రామాలయ చిత్రపటంతోపాటు అక్షింతలను ఎల్లారెడ్డి ఎస్సై గణేశ్‌కు రామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు అందజేశారు. 22వ తేదీన ఎల్లారెడ్డి కోదండ రామాలయంలో నిర్వహించే శ్రీరామ పట్టాభిషేకం, పూజా కార్యక్రమాలకు ఆయనను ఆహ్వానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ప్రణయ్ జోషి, మహేశ్, నవీన్, శ్రీకాంత్, వినోద్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండ గొర్రె మాంసం స్వాధీనం..

- ఒకరిపై కేసు నమోదు



నిందితుడి ఇంటినుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న కత్తి

రాజంపేట్, జనవరి 14: కొండ గొర్రెను చంపిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ క్షేత్ర అధికారి వి.రమేశ్ ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఫారెస్ట్ అధికారులు మండలంలోని శేర్‌శంకర్ తండాలో కాట్రోత్ గోవింద్ ఇంటిపై శనివారం రాత్రి దాడిచేయగా, కొండ గొర్రె మాంసం లభించింది. ఆయనను విచారించగా అటవీ ప్రాంతంలో గొర్రెను చంపి తీసుకువచ్చినట్లు తెలిపాడని, మాంసాన్ని ముక్కలు చేసేందుకు ఉపయోగించిన కత్తులు, మొద్దును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అతడిపై కేసు నమోదు చేశామని చెప్పారు. కామారెడ్డి సెక్షన్ ఆఫీసర్లు బాబా, భీంరెడ్డి, బీట్ అధికారులు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

గాంధారి, జనవరి 14: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బ్యాంగిల్ స్టోర్ కాలిపోయిన ఘటన గాంధారిలో చోటు చేసుకున్నది. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కంచుమల్ గ్రామానికి చెందిన విజయ బ్యాంగిల్ స్టోర్‌తో పాటు లేడీస్ టైలర్ నిర్వహిస్తున్నది. ఆదివారం మధ్యాహ్నం దుకాణం మూసి ఇంటికి వెళ్లింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.50వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## ఘనంగా లక్ష్మమ్మ జాతర

- భారీగా తరలివచ్చిన గిరిజనులు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

గాంధారి, జనవరి 14: మండలంలోని చద్మల్ తండాలో ఉన్న మథుర లంబాడాల ఆరాధ్యదైవం లక్ష్మమ్మ జాతరను రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తండాలోని లక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భోగి పర్వదినం రోజున జాతరను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువైన లక్ష్మమ్మకు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతోపాటు, హోమాలు కాల్చారు. జాతరకు చద్మల్ తండా వాసులతో పాటు మండలంలోని నేరల్, గుర్జాల్, సిద్దాపూర్, బీర్మల్, నాగ్లూర్, తిప్పారం, గొల్లాడి, జెమినితండాకు చెందిన మథుర లంబాడాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో దుకాణ సముదాయాలు వెలిశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ మండారిబాయి ప్రేమ్‌సింగ్, ఉప సర్పంచ్ జగదీశ్, తండావాసులు బంతీలాల్, మురారి, ప్రేమ్‌సింగ్, అమర్‌సింగ్, నారాయణ, సంతోష్, ఇంద్రజీత్, చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.


లక్ష్మమ్మ ఆలయంలో యజ్ఞం


జాతరలో వెలిసిన దుకాణాలు, భక్తుల సందడి

## నేడు క్రికెట్ పోటీలు

పిట్లం, జనవరి 14: పిట్లంలోని బ్రహ్మంగారి ఆలయం ఎదుట నేడు (సోమవారం) క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు అడ్వకేట్ రాంరెడ్డి, బొడ్ల రాజు అదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ విజయోత్సవ క్రికెట్ టోర్నీని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రారంభిస్తారని తెలిపారు. క్రీడాకారులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వాహనాల తనిఖీ

సదాశివనగర్, జనవరి 14: మండలంలోని పద్మాజివాడి ఎక్స్ రోడ్డు సమీపంలో ఎస్సై రాజు ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్టును తప్పకుండా ధరించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో అన్ని రకాల ధ్రువ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ఆయనవెంట సిబ్బంది ఉన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే


వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, జనవరి14: తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామిని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదివారం దర్శించుకున్నారు. నియోజకవర్గం సుభిక్షంగా, ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు.

## ఆలయశుద్ధి

బిచ్కుంద, జనవరి 14: బిచ్కుందలోని బండాయప్ప మఠ సంస్థానంలో ఉన్న శివాలయాన్ని ఆదివారం శుద్ధి చేశారు. ఈ సందర్భంగా శ్రీ సోమలింగ శివాచార్య స్వామి మాట్లాడుతూ.. 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఉన్న దేవాలయాలను శుద్ధి చేసుకోవాలని అన్నారు.

# భోగి మంటలు.. పిండి వంటలు

- జిల్లాలో సంక్రాంతి వేడుకలు షురూ
- పల్లె, పట్నంలో పతంగుల సందడి
- ఇంటింటా పిండి వంటల ఘుమఘుమలు


నిజాంసాగర్ మండలంలోని మాగి గాయత్రి ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన భోగి మంటలు


బీర్కూర్ మండలం రైతునగర్‌లో భోగి మంటలు వేసిన గ్రామస్తులు

గాంధారి/ సదాశివనగర్/ నిజాంసాగర్/ పిట్లం/ బీబీపేట్/ దోమకొండ/ నస్రుల్లాబాద్, జనవరి 14: మూడు రోజుల పాటు జరుపుకొనే సంక్రాంతి సంబురాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం భోగి పండుగను జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే వాకిళ్లలో కల్లాపి చల్లి, రంగురంగుల ముగ్గులను వేశారు. ముంగిళ్లలో గౌరమ్మను ఉంచి నవ ధ్యానాలతోపాటు రేగుపండ్లు, గరక ఉంచారు. చిన్నపిల్లలకు భోగి పండ్లను పోశారు. ప్రతి ఇంట్లో తీపి పదార్థాలతో పాటు, సకినాలు, చెకోడీలు, గారెలు తయారు చేసుకున్నారు. యువకులు, చిన్న పిల్లలు గాలిపటాలను ఎగురవేస్తూ ఆనందగా గడిపారు. బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలో జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ తెల్లవారుజానే భోగి మంటలు వేసుకున్నారు. యువత, మహిళలు భోగి మంటల చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దినేని నాగేశ్వర్ రావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. నిజాంసాగర్ మండలంలోని మాగి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో వేకువజామున భోగి మంటలు వేశారు. క్వార్టర్స్‌లో ఉండే ఉద్యోగుల కుటుంబాలు ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగ చేసుకోనున్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీని నిర్వహించారు. కార్యక్రమంలో కేన్ మేనేజర్ వెంగళ్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజాబాబు, గోవింద్‌తో పాటు కార్మికులు, వారి కుటుంబీకులు పాల్గొన్నారు. బీబీపేట్, దోమకొండ, రాజంపేట్ మండలాల్లో భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు →




కామారెడ్డిలో పిండి వంటలు చేస్తున్న ఓ కుటుంబం


బాన్సువాడ పట్టణంలో ముగ్గులు వేస్తున్న యువతులు, మహిళలు


పిట్లం మండలం గుడితండాలో ముగ్గులు వేస్తున్న మహిళలు

## ముగ్గుల పోటీలు

నస్రుల్లాబాద్/పిట్లం/బాన్సువాడ టౌన్ జనవరి 13: సంక్రాంతి సంబురాల్లో భాగంగా పలుచోట్ల ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. బాన్సువాడ పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భోగి మంటలు వేసి ముగ్గుల పోటీలు నిర్వహించారు. అందమైన ముగ్గులను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు. నస్రుల్లాబాద్ మండలం సంగం తండాలో తొలిసారి ముగ్గుల పోటీలు నిర్వహించారు. గిరిజన యువతులు పెద్దసంఖ్యలో పాల్గొని సేవాలాల్ ఆలయ ఆవరణలో అందమైన ముగ్గులు చేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చందర్, ధూప్‌సింగ్, సునీల్ రాథోడ్, భీమ్ సింగ్, శంకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. పిట్లం మండలం పోతిరెడ్డిపల్లి గుడితండాలో యూత్ సభ్యులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తండా నాయకుడు సురేశ్‌రాథోడ్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించామని తెలిపారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.


నస్రుల్లాబాద్ మండలం సంగం తండాలో యువతులకు బహుమతులను అందజేస్తున్న గ్రామ పెద్దలు

## ‘సరిహద్దు’లో సంక్రాంతి

- విభిన్నంగా వేడుకలు
- ప్రకృతి ఆరాధన.. చేలల్లో పూజలు

బోధన్, జనవరి 14: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మంజీర తీరం, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉండే గ్రామాల్లో సంక్రాంతి పండుగను విభిన్నంగా జరుపుకొంటారు. స్థానికులు సరిహద్దు గ్రామాల్లో చేలల్లోనే పూజలు, నైవేద్యాలతో భోజనాలు చేస్తారు. ఏపీ నుంచి వలస వచ్చిన గ్రామాల్లో మాత్రం ఆడపిల్లల ఆటాపాటలు, చిన్నారులకు భోగిపండ్లు, కొత్త అల్లుళ్లకు రాచమర్యాదలు.. సర్వసాధారణంగా కనిపిస్తుంటాయి. ఇలా.. మంజీర తీరాన రకరకాల సంస్కృతులతో సంక్రాంతిని పండుగను జరుపుకోవడం


పంట చేనులో పండుగ జరుపుకుంటున్న బోధన్ మండలం కల్దుర్కి గ్రామస్తులు

ఆనవాయితీగా వస్తున్నది. బోధన్, రెంజల్, కోటగిరి, మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ తదితర మండలాలతో పాటు అటు మెదక్‌లోని నారాయణఖేడ్ ప్రాంతంలో ప్రకృతి ఆరాధనే ప్రధానాంశంగా సంక్రాంతి పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సంక్రాంతి సమయానికి జొన్న, శనగ, ఇతర పంటలు ఏపుగా ఎదుగుతున్న దశలో ఉంటాయి. ఈ పంటలను కాపాడుకోవాలన్న తపన వ్యవసాయ కుటుంబాల్లో ఎక్కువగా ఉంటుంది. అందుకే సంక్రాంతి రోజు చేలల్లో పంచ పాండవులకు పూజలు చేయడం, మొక్కలకు రవికెను సమర్పించడం.. ఇలా విలక్షణంగా ఇక్కడి గ్రామీణ ప్రజలు చేస్తుంటారు. ఏపీ నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన ప్రజలు ఈ పండుగను ఘనంగా జరుపుకొంటారు. అరిసెలు తదితర పిండి వంటలతో పాటు గారెలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. తప్పనిసరిగా కొత్త బట్టలు కట్టుకుంటుంటారు. కొత్త అల్లుళ్లకు సంక్రాంతిరోజు మర్యాదలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎక్కడెక్కడో ఉపాధిని పొందుతున్న కుటుంబసభ్యులంతా సంక్రాంతి రోజున కలుసుకోవడం వీరి ప్రత్యేకత.